

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

### (కిందటి సంచికనుండి కొనసాగింపు)

**అన్నయ్య చెప్పాడని** హిస్ మేజెస్టీస్ అపోనెంట్ చదవడం మొదలుపెట్టాను. హిస్టరీ బుక్‌లా అనిపించి ఎంతో బోర్ కొట్టింది. అందులో ఉన్న ఫోటోలు మాత్రం చూడ్డం మొదలు పెట్టాను. ఇంతలో అన్నయ్య వచ్చి "అప్పుడే అంత చదివేసావా?" అడిగాడు.

"లేదు. బోర్ కొట్టింది. ఫోటోస్ చూస్తున్నా" అన్నాను.

పెద్దగా నవ్వాడు. "నీకు కొనుక్కోవాల్సినవి ఏమైనా ఉన్నాయా?" అడిగాడు.

"లేదు. ఎందుకు? షాప్‌కి వెళుతున్నావా?"

"లేదు. నువు ఇంకో రెండు రోజుల్లో వెళ్ళిపోతున్నావు కదా. అందుకని అడిగాను." వెళ్ళిపోతున్నా అనగానే ఎంతో దిగులు కలిగింది.

"మళ్ళీ ఏడుస్తున్నావా, ఏంటి?" వెటకారంగా అన్నాడు.

"లేదు. ఏం కొనక్కర్లేదు."

"కావాలంటే చెప్పు. ఒకసారి మాల్‌కి వెళ్ళి రావచ్చు"

"అక్కరలేదులే. అన్నీ ఉన్నాయి."

"గుడ్. లంచ్‌కి బయటికి వెళదామా?"

"సరే. వెళదాం."

"రెడీ అవ్వు. ఆకలిగా ఉంది" అన్నాడు.

ఇద్దరం కలిసి బయలుదేరాము. "నీకు ఆ బుక్ బోర్ కొట్టలేదా?" అడిగాను.

"లేదు. చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. అది చదివి నేను మన దేశం గురించి, పాకిస్థాన్ గురించి చాలా తెలుసుకున్నాను."

"ఔనా? అంటే ఎలాంటివి? కింగ్స్, బ్రిటిషర్స్, వాటి గురించా?"

"లేదు. అప్పట్లో ఉన్న పాలిటిక్స్ ఇంకా సొసైటీ గురించి"

"ఓ.ఓకే. అవన్నీ నాకు బోరింగ్ అనిపిస్తాయి."

ఇంతలో రెస్టారెంట్‌కి వచ్చాము. చాలామంది ఉన్నా మాకు వెంటనే టేబుల్ ఇచ్చారు.

"ఇక్కడ పపాయ సలాడ్ బావుంటుంది" అన్నయ్య అన్నాడు.

"ఛీ. పపాయ సలాడా? నాకొద్దు"

"కొంచెం తిని చూడవే. బావుంటుంది."

అన్నయ్య పపాయ సలాడ్, సూప్ ఆర్డర్ చేసాడు. భయపడుతూ సలాడ్‌ని రుచి చూసాను. రుచిగా ఉంది.తీయగా కాక కాస్త పుల్లగా, కాస్త కారంగా బావుంది.

ఇంతలో మా పక్క టేబుల్‌కి ఓ నలుగురు పిల్లలు, వాళ్ళ నాన్న వచ్చారు. పిల్లలు రెండునుండి తొమ్మిది వయసువారయ్యుంటారు. వాళ్ళ నాన్న ఫోన్ చూస్తూ పిల్లల్ని పట్టించుకోలేదు. ఆ పిల్లలు టేబుల్ మీద స్పూన్లన్నీ నేలమీద పడేసారు. అందరిలోకి పెద్ద పిల్లాడు 'ఐం సూపర్ హీరో' అంటూ గట్టి గట్టిగా నవ్వాడు. ఈలోగా ఓ ఇద్దరు కొట్టుకున్నారు. వాళ్ళ నాన్న ఫోన్‌లోంచి తల తీసి ఒక్క అరుపు అరిచాడు. దాంతో ముగ్గురు పిల్లలు ఏడవసాగారు. దాంతో నాకు తలనెప్పి మొదలయ్యేలాగా అనిపించింది. అది గమనించి, "కొంతమంది అంతే పిల్లల్ని పట్టించుకోరు" అన్నాడు.

"ఔను. మన దగ్గరే నయం" అన్నాను.

"మనవాళ్ళు కూడా ఏం తక్కువకాదు."

"అదేంటి? మనవాళ్ళు బానే పట్టించుకుంటారు కదా"

"అందరూ కాదు. చాలామంది విచిత్రంగా ప్రవర్తిస్తారు. మన విజ్ఞాన్ చిన్నప్పుడు ఒక్క మాట కూడా అనేవారు కాదు. అబ్బాయిని అతి గారాబం చేసారు. వాడు స్కూల్‌లో చేసే గొడవకి రోజూ పనిష్‌మెంట్ ఇచ్చేవరు .టీచర్ కొట్టిందని గొడవకూడా పెట్టుకున్నారు. నెమ్మదిగా వాడే నేర్చుకుని మారాడు."

"ఔనా. నాకిది తెలీదు."

"అంతెందుకు? బబ్లూ లేదు. వాళ్ళ అమ్మ అయితే చెడకొట్టింది వాడిని. వాడు ఎనిమిదేళ్ళ దాకా డైపర్ వేసుకునేవాడు. స్కూల్లో పిల్లలు అంతా ఎక్కిరిస్తే మానేసాడు. ఆ డైపర్ కూడా సరిగ్గా మార్చకపోయేసరికి వాడికి ఎప్పుడూ అనారోగ్యమే. పిల్లల్ని కొట్టేవాడు, గిచ్చేవాడు, అన్నీ పిచ్చి పనులే, కానీ వాళ్ళ అమ్మ ఒక్కమాట కూడా అననిచ్చేది కాదు. విజ్ఞాన్ లాగ వాడు మారలేకపోయాడు. ఇప్పటికి ఇరవైకి పైగా పెళ్ళి సంబంధాలు చూసారు కానీ వాడిని ఎవ్వరూ భరించలేకపోయారు." ఇంతలో పక్క టేబుల్ మీద నీళ్ళ గ్లాసు పడేయడంతో వాళ్ళు టేబుల్ మారారు.

"ఇవన్నీ నాకెందుకు తెలియవు?" అడిగాను.

"నువ్వు అప్పటికి పుట్టలేదు. ఇవన్నీ అమ్మ వాళ్ళు ఈ రోజుకీ మాట్లాడుతూనే ఉంటారనుకో."

తినడం పూర్తయ్యాక భుక్తాయాశంతో నిద్ర వచ్చింది. నా ఆవులింత చూసి, "నిద్రొస్తుందా?" అడిగాడు.

"కొంచెం" అన్నాను.

"ఇంటికెళదామా, లేదా బయటికి వెళదామా?" అడిగాడు.

"బయటికెక్కడికి?"

"నా కోవర్కర్‌కి గిఫ్ట్ కొనాలి. రేపు మనని న్యూ ఇయర్ పార్టీకి పిలిచారు."

"నేనేమి వేసుకొవాలి.

"ఏదైన మంచిది వేసుకో. మరీ పెద్దగా తయారవ్వక్కర్లేదు. వాళ్ళ ఇంట్లోనే పార్టీ."

"సరే. నేనూ వస్తా గిఫ్ట్ కొనడానికి."

ఇద్దరం వెళ్ళి గిఫ్ట్ కొని ఇంటికి బయలుదేరాము.

"ఏం చేస్తారు పార్టీ అంటే?"

"ఏం లేదు. అందరం కలిసి మాట్లాడతాము, లేదా ఏదైనా బోర్డ్ గేమ్ ఆడతాము."

"నాకు ఎవరైనా తెలుసా?"

"నువ్వు ఇంతకముందు కలిసావు కొంతమందిని."

"నాకు బోర్ కొడుతుందేమో?"

"బోర్ కొడితే చెప్పు. ఇంటికి వచ్చేద్దాం"

ఈలోగా ఇల్లు చేరాము. నేను ఒక కునుకేసి లేచేలోగా అన్నయ్య ఆఫీస్‌పని చేసుకుంటున్నాడు.

"చాలా సేపే పడుకున్నావ్" అన్నాడు.

"ఔనా? టైం ఎంత?"

"ఐదు దాటింది."

"అప్పుడే ఐదయ్యిందా?" అన్నయ్య మాట నమ్మబుద్ధికాక ఫోన్‌లో చూద్దాం అనుకున్నాను కానీ ఫోన్ ఎక్కడా కనబడలేదు. జీన్స్ పాకెట్, మంచం కింద, పరుపు కింద, అన్ని చోట్ల వెతికాను. టెన్షన్ మొదలైంది. అన్నయ్యకి నా ఫోన్‌కి కాల్ చెయ్యమని సోఫా దిండుకింద, ఇల్లంతా వెతికాము. "ఇంటికి తెచ్చావా? బయట మర్చిపోయావా?" అడిగాడు.

"తెచ్చాను అన్నాయ్. తెచ్చిన గుర్తుంది. పడుకునేముందు మెసేజెస్ చూసి పడుకున్నాను."

"మరి ఎక్కడ ఉండచ్చు?" మళ్ళీ బెడ్ రూం అంతా వెతికాడు.

"ఫైండ్ మై ఐ ఫోన్ ఉందా?" అడిగాడు.

"లేదు" టెన్షన్ గొంతులో వినబడింది.

"ఇంటికి వచ్చేప్పుడు కింద పడిందేమో ఒకసారి బయట చూసి వస్తా" అన్నాడు.

ఇంట్లో ఎక్కడా లేకపోయేసరికి నేను ఆపలేదు. దాదాపు ఏడుపొక్కటి తక్కువ పరిస్థితిలోకి జారాక అన్నయ్య పైకి వచ్చాడు.

"ఇదిగోనే. కారు సీట్ కింద పడిపోయింది" అని ఫోన్ చేతికిచ్చాడు.

"థాంక్స్" అని కళ్ళల్లో నీరు ఆపుకున్నాను.

"చాలా కాన్ఫిడెంట్‌గా పడుకునే ముందు మెసేజెస్ చూసుకున్నా అన్నావు?" వెటకారంగా అడిగాడు.

"అనుకున్నాను. నిజంగానే చూసిన గుర్తు."

ఇద్దరం నవ్వాము.

"డిన్నర్‌కి ఇంట్లోనా? బయటా?" అడిగాడు.

"ఇంట్లోనే."

"ఏం వండను?"

"ఉత్త అన్నం చాలు. పచ్చడి తినాలనుంది."

"వేడి వేడి అన్నం, నెయ్యి, పచ్చడా?" నవ్వాడు.

"అవును."

"నీకు సుజాత ఆంటీ గుర్తున్నారా?"

"గుర్తుంది. ఎందుకు?"

"ఓసారి ఫోన్ చేసింది అమ్మకి, "ఏం వండారు? " అని అడిగింది. అమ్మ 'మజ్జిగ పులుసు, కందిపొడి, చుక్కకూర పప్పు, ఆ కాకరకాయ కూర' అని చెప్పింది. ఆవిడేమో 'మేము మాత్రం ఎంచక్కగా వేడి వేడి అన్నం, నెయ్యి, ఆవకాయ పచ్చడి తిన్నాము ' అని అన్నారట,"

ఇద్దరం నవ్వుకున్నాము.

"నీకు చిన్నప్పటి నుంచే హిస్టరీ అంటే ఇష్టమా?" టేబుల్ మీద పొద్దున పెట్టిన పుస్తకం తిరగేస్తూ అడిగాను.

"లేదు. ఇక్కడికి వచ్చాకే ఇంట్రెస్ట్ కలిగింది."

"అలా ఎలా?"

"మన దగ్గర అన్ని బుక్స్ లేవుకదా. ఇక్కడ లైబ్రరీలో బోలెడు పుస్తకాలు అవి చదువుతూ ఆసక్తి పెరిగింది."

"ఇంతకీ ఇందులో పాకిస్తాన్ గురించి ఎందుకుంది? సుభాష్ చంద్రబోస్ ఇండియన్ ఫ్రీడం ఫైటర్ కదా?"

"మొద్దు. పాకిస్తాన్ ఒకప్పుడు ఇండియానే. విడిపోయినప్పటి సంగతులు, విడిపోవడానికి కారణాలు ఉన్నాయి ఇందులో. సుభాష్ చంద్రబోస్ మనం కలిసే ఉండాలని చాలా కష్టపడ్డాడు కానీ తనమాట ఎవరూ వినిపించుకోలేదు. దాన్ని గురించి ఉంది."

"నేనేం మొద్దుని కాదు. పాకిస్తాన్ మన కంట్రీలోనే ఉండేదని తెలుసు నాకు. ఇది మరీ టూమచ్. కోప్పడ్డాను. అన్నయ్య నవ్వాడు.

"ఇంతకీ ఎందుకు విడిపోయారు?" అడిగాను.

"అప్పటిలో ముస్లింస్‌ని చిన్నచూపు చూసేవారు. సెకెండ్ క్లాస్ సిటిజెన్‌లా ఉండేది. అందుకే వారు విడిపోవడానికి ఇష్టపడ్డారు."

"ఎందుకూ? ఇప్పుడు మాములుగానే ఉంది కదా?"

"బ్రిటిష్ వారు రావడానికి ముందు హిందువులు, ముస్లింలు కొట్టుకునేవారు. పృధ్వీరాజా చౌహాన్ లాస్ట్ హిందు కింగ్. ఆ తరవాత ముస్లిం పాలన కూడా మొదలైంది. అప్పట్లో రాజులందరూ హిందూ దేశం కోసం యుద్ధాలు చేసేవారు. బాబర్ నుండి ఔరంగ్ జేబ్ వాళ్ళ అబ్బాయి అక్బర్ వరకు మిగతా రాజులందరితో యుద్ధాలు జరిపారు"

"ఔనా? నాకిది తెలీదు. అయితే బ్రిటిష్ వాళ్ళు వెళ్ళిపోయాక మళ్ళీ యుద్ధం జరిగేదా?"

"లేదు. అయినా అలా జరగకుండా పాకిస్థాన్‌ని సృష్టించారు. ఆ తరువాత జరిగింది మనం స్కూల్‌లో చదువుకున్నాం"

"పాకిస్థాన్ వాళ్ళందరూ అంతేనా?"

"నీ బొంద, కొంతమంది అలా ఉంటారు. అంతే. అది ఎక్కడైనా ఉంటారు. మొత్తం దేశం తప్పు కాదు. ముఖ్యంగా కేవలం పొలిటీషన్స్."

"మరి ఫేమస్ పాకిస్థాన్ వాళ్ళెవరు? నాకు ఆతిఫ్ అస్లాం మాత్రమే తెలుసు. వాళ్ళింకా చాలా వెనకబడి ఉన్నారు."

"వాళ్ళ దేశం మనలాగా కాదు. వాళ్ళు కురాన్ ని ఫాలో అవుతారు. కురాన్‌లో ఏది తప్పో, ఒప్పో అవే వాళ్ళు నమ్ముతారు. మనలాగే స్వేచ్ఛగా ఉండదు. అయినా ఫేమస్ అన్నావు కాబట్టి చెప్తా.. భగత్ సింగ్."

"భగత్ సింగ్ అంటే ఇండియన్ ఫ్రీడం ఫైటరా?"

"ఔను. తను పుట్టి పెరిగిన పంజాబ్ ఇప్పుడు పాకిస్థాన్‌లో భాగం."

"ఓ. నాకు తెలీదు. నిజమా?"

"ఔను. దౌర్భాగ్యమేంటంటే ఆ ఊళ్ళో ఉన్నవారు ఇప్పుడు తన త్యాగాలు గుర్తుపెట్టుకోలేదు."

రాత్రి కలలో యుద్ధాలు, వేటలు, బాంబులు రాకూడదని దండం పెట్టుకుని నిద్రపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story